

అగ్రనటుడు నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయన నట స్వర్ణోత్సవాన్ని తెలుగు చిత్ర పరిశ్రమ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అగ్రనటుడు చిరంజీవి, మోహన్‌బాబు, వెంకటేశ్ అతిథులుగా విచ్చేసి బాలకృష్ణకు శుభాభినందనలు అందించారు. నటుడిగా అయిదు దశాబ్దాల బాలకృష్ణ విజయాలను వారు కొనియాడారు. తనను ఇంతగా గౌరవించి, ఇంతటి వేడుక నిర్వహించిన తెలుగు చిత్ర పరిశ్రమకు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో యువ హీరోలు నాని, విజయ్ దేవరకొండ, అల్లరి నరేశ్, మంచు విష్ణు, మంచు మనోజ్, రానా, సిద్ధూ జొన్నలగడ్డ, అడవి శేషు ఇంకా తెలుగు చలనచిత్ర, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రేక్షకుల్ని ఎడ్యుకేట్ చేస్తుంది


సుహాస్, సంగీర్తన జంటగా దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించిన చిత్రం 'జనక అయితే గనక'. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మాతలు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ ' ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. ఇది డిఫరెంట్ కథతో తెరకెక్కిన సినిమా. వినోదంతో పాటు ఆడియన్స్‌ని ఎడ్యుకేట్ చేసేలా ఉంటుంది. సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుంది. ఈ నెల 6న ప్రీమియర్లు వేస్తున్నాం. ఆడియన్స్ రెస్పాన్స్ కోసం ఎదురుచూస్తున్నా' అని అన్నారు. ఇంకా సుహాస్, దర్శకుడు సందీప్‌రెడ్డి బండ్ల, ఎడిటర్ కోదాటి పీకే, విజయ్ బుల్గానిక్ కూడా మాట్లాడారు.



## పదేండ్లుగా ఆయన్ని ప్రేమిస్తున్నా!

దక్షిణాది సినీరంగంలో సాయిపల్లవి పంథాయే వేరు. గ్లామర్ పాత్రలకు పూర్తి దూరంగా ఉంటుందీ భామ. చూడగానే పక్కింటి అమ్మాయిలా కనిపించే ఈ తమిళ సొగసరి ఎలాంటి నాటకీయత లేని సహజమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది. అందుకే ఈ భామకు దక్షిణాదిలో అభిమానగణం ఎక్కువ. 'ప్రేమమ్'తో మలయాళ సినీరంగంలో మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు బాలీవుడ్ వరకూ వెళ్లింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు మీరు ప్రేమలో పడలేదా? అని అడగ్గా.. మహాభారత ఇతిహాసం తనకు చాలా ఇష్టమని, అందులో అభిమన్యుడి పాత్రను తాను ఎంతగానో ప్రేమిస్తానని చెప్పుకొచ్చింది. 'గత పదిహేడేండ్లుగా అభిమన్యుడి పాత్ర గురించి ఏదో కొత్త విషయం తెలుసుకుంటూనే ఉన్నా. ఆయనకు సంబంధించిన ఏ కథ అయినా నాలో ఆసక్తిని పెంచుతుంది. ఓరకంగా చెప్పాలంటే గత పదేండ్లుగా ఆయన ప్రేమలో ఉన్నా అంటూ నవ్వుతూ తన మనసులోని మాటను బయటపెట్టింది. సాయిపల్లవి సమాధానం విన్న నెటిజన్లు ఆమెలో హాస్యచతురత కాస్త ఎక్కువేనని కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సాయిపల్లవి తెలుగులో 'తండేల్', తమిళంలో 'అమరన్', హిందీలో 'రామాయణ' సినిమాలతో బిజీగా ఉంది.

## కూలీ నెం 1421



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా నుంచి రజనీకాంత్ కొత్త పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో ఆయన దేవా అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. చేతిలో 1421 నెంబర్ కలిగిన బ్యాడ్జీ పట్టుకొని రజనీకాంత్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున, సత్యరాజ్, శృతిహాసన్, ఉపేంద్ర వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదలకానుంది. ఇదిలావుండగా రజనీకాంత్ నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ 'జైలర్' సినిమా సీక్వెల్ గురించి దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, త్వరలోనే చిత్రాన్ని సెట్స్‌మీదకు తీసుకొస్తామని తెలిపారు. అక్టోబర్‌లో ప్రారంభంకానున్నట్లు సమాచారం.



## బిల్లా రంగా బాషా

కన్నడ అగ్రహీరో కిచ్చా సుదీప్ కథానాయకుడిగా రూపొందనున్న చిత్రం 'బిల్లా రంగా బాషా'. అనూప్ భండారి దర్శకుడు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో 'విక్రాంత్ రోణ' చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. 'హను-మాన్'ఫేం కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ఈ హైబడ్జెట్ చిత్రానికి నిర్మాతలు. కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా కాన్సెప్ట్ వీడియోను, టైటిల్‌కి సంబంధించిన అఫీషియల్ లోగోను మేకర్స్ విడుదల చేశారు. ఇది భవిష్యత్‌లో జరిగే కథ అని ఈ వీడియో చెబుతున్నది. క్రీ.శ.2209వ సంవత్సరాన్ని ఎస్టాబ్లిష్ చేస్తూ.. ది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, ఈఫిల్ టవర్, తాజ్ మహల్ స్మాష్ అయినట్టు చూపిస్తూ, ఓ వ్యక్తి ప్రపంచాన్ని జయించినట్టు ప్రజెంట్ చేయడం ఈ వీడియోలో ఆసక్తికరంగా ఉంది. 'విక్రాంత్ రోణ'ని మించే స్థాయిలో ఈ సినిమా ఉంటుందని, సుదీప్ అభిమానుల అంచనాలను అందుకునేలా సినిమా వుంటుందని దర్శకుడు అనూప్ భండారి చెబుతున్నారు. అతి త్వరలో ఈ పాన్ ఇండియా సినిమా షూటింగ్ మొదలుకానుంది.



## 'బొంబాయి' ఏడిపించింది!

దక్షిణాది సినీరంగంలో ప్రయోగాత్మక పాత్రల ద్వారా విలక్షణ నటుడిగా గుర్తింపును సంపాదించుకున్నాడు అగ్రహీరో విక్రమ్. ఆయన తాజా చిత్రం 'తంగలాన్'కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ సందర్భంగా ఓ విజయోత్సవ సమావేశంలో పాల్గొన్న విక్రమ్ 'బొంబాయి' సినిమాలో తాను హీరోగా నటించే అవకాశాన్ని కోల్పోవడం ఎంతగానో బాధించిందని చెప్పారు. కల్ట్‌క్లాసిక్ నిలిచిన సినిమాను మిస్ చేసుకోవడం కెరీర్‌లో చేసిన పెద్ద తప్పిదమని విక్రమ్ అన్నారు. 'మణిరత్నం వర్కింగ్‌స్టైల్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డైరెక్షన్‌లో నటించిన తర్వాత ఇండస్ట్రీ నుంచి తప్పుకున్నా ఫర్వాలేదు అనుకునేవాడిని. ఈ క్రమంలో 'బొంబాయి' సినిమాలో ఛాన్స్ వచ్చింది. హీరోగా నన్ను దాదాపు ఖరారు చేశారు. అయితే ఆడిషన్ సందర్భంగా నేను చేసిన చిన్న తప్పిదం వల్ల సినిమా మిస్ అయింది. స్టిల్ కెమెరా నా ముందు పెట్టి సీన్‌లో నటించమని చెప్పారు. స్టిల్ కెమెరా ముందు యాక్ట్ చేయడమేంటి? అనే భావనతో నేను సీన్ చేయకుండా అలాగే ఉండిపోయా. దాంతో నన్ను తప్పించారు. 'బొంబాయి' జాతీయ స్థాయిలో కల్ట్‌క్లాసిక్‌గా నిలిచింది. ఆ సినిమా విడుదలైన తర్వాత రెండు నెలలు ఎంతో ఆవేదన చెందాను. రోజూ ఉదయం లేవగానే ఏడుస్తూ కూర్చునేవాణ్ణి' అని విక్రమ్ తెలిపారు. 'బొంబాయి' సినిమా మిస్ అయినప్పటికీ..ఆ తర్వాత మణిరత్నం దర్శకత్వం వహించిన 'రావణ్' 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాల్లో విక్రమ్ కథానాయకుడిగా నటించారు.



## రీటేక్.. అనే పదమే నా చెవులకు ఇంపు

అనుపమా పరమేశ్వరన్ స్పీడ్ మామూలుగా లేదు. 'టిల్లూ స్క్వేర్'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం షూటింగ్‌ల్లో బిజీబిజీ. ఈ అందాల భామ చేతిలో ప్రస్తుతానికి ఆరు సినిమాలున్నాయి. వచ్చే ఏడాది వరకూ కొత్త సినిమాలకు డేట్స్ ఇచ్చే పరిస్థితి లేదట. అంత బిజీ ప్రస్తుతం అనుపమ. రీసెంట్‌గా తన నట ప్రయాణం గురించి ఆసక్తికరంగా మాట్లాడింది అనుపమ. 'కంఫర్ట్ జోన్‌లో సినిమాలు చేయడం నాకు అస్సలు నచ్చదు. అలా పనిచేయడం చాలా బోరింగ్. భిన్నమైన సినిమాల ప్రయాణమంటేనే నాకిష్టం. ప్రయోగాత్మకమైన పాత్రలు చేసినప్పుడు కలిగే సంతృప్తి గురించి మాటల్లో చెప్పలేం. నటిగా ఛాలెంజిగ్ రోల్స్‌నే ఎక్కువగా ఇష్టపడతా. సెట్‌లో డైరెక్టర్ రీటేక్స్ అడిగినప్పుడు నాలో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఎన్ని టేకులైనా విసుగు లేకుండా చేస్తా. 'బాగా నటించావ్' అనే పదం కంటే 'రీటేక్' అనే పదమే నా చెవులకు ఇంపుగా ఉంటుంది. అలా ఉంటేనే నటనలో మరింత పరిపక్వత పొందగలం' అంటూ చెప్పుకొచ్చింది అనుపమ.

## అమ్మ గుర్తొచ్చింది



'కాన్సెప్ట్‌తోపాటు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న కథలు చేస్తూ ముందుకెళ్లాలనేది నా అభిమతం. అందులో భాగంగానే నాలుగొందల కథలు విన్నాను. వాటిలో ఓ ఐదు కథల్ని సెలక్ట్ చేసుకున్నాను. నిజానికి ఆ ఐదు కథలు కూడా నాకు పూర్తిగా సంతృప్తినివ్వలేదు. ఏదైనా చేస్తే జనాల హృదయాల్లో నిలిచిపోవాలి. మహానటి, జర్నీ, సీతారామం సినిమాల్లా క్లాసిక్స్‌గా మిగిలిపోవాలి. అలాంటి కథ వెతుకుతున్న సమయంలో నాకు దొరికిన కథ '35-చిన్నకథ కాదు'. విశ్వనాథ్, బాపూ, కె.బాలచందర్ సినిమాలు చూసిన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని నిర్మాత సృజన్ యరబోలు అన్నారు. నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధానపాత్రధారులుగా నందకిశోర్ ఈమని దర్శకత్వంలో దగ్గుబాటి రానా, సిద్ధార్థ్ రాళ్లపల్లిలతో కలిసి ఆయన నిర్మించిన చిత్రం '35-చిన్నకథకాదు'. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో ముచ్చటించారు. 'మదర్ సెంటిమెంట్ ఈ సినిమాకు ప్రధాన బలం. ఈ కథ నాకంత నచ్చడానికి కారణం అదే. ఈ కథలో నివేద పాత్ర చూస్తే నాకు మా అమ్మ గుర్తొచ్చింది. ఈ కథ భావోద్వేగాల మేళవింపు. చూస్తున్న ప్రేక్షకుడు ఏదోఒక విషయంలో కనెక్ట్ అయిపోతాడు. చాలా రోజుల తర్వాత పిల్లల కోసం ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్‌కి వెళ్లే సినిమా ఇది. తిరుపతి నేపథ్యం.. అక్కడి వాతావరణం, ఆ ఇల్లు, స్కూల్.. ఓ ఆహ్లాదకర ప్రపంచంలో ఉన్న అనుభూతినిచ్చే సినిమా ఇది' అని తెలిపారు నిర్మాత సృజన్. నివేద తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించలేమనీ, తిరుపతి స్లాంగ్ చాలా కష్టపడి నేర్చుకొని అద్భుతంగా పెర్ఫార్మ్ చేసిందని, హీరో విశ్వదేవ్‌ని ఆడిషన్స్ చేసి తీసుకున్నామని, చాలా బాగా చేశాడని, అలాగే ప్రియదర్శి, భాగ్యరాజా, గౌతమి అందరూ తమ పాత్రల ద్వారా కథను రక్తికట్టించారని ఆయన తెలిపారు.



## రూమర్ల నేపథ్యంలో సెలబ్రిటీ

ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. రవికిశోర్ దర్శకుడు. ఎన్.పాండురంగారావు, చిన్న రెడ్డయ్య నిర్మాతలు. వరలక్ష్మీశరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు ఇందులో కీలక పాత్రధారులు. ఈ సినిమా టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. యాక్షన్, సస్పెన్స్ అంశాలతో కూడిన సినిమా ఇదని టీజర్ చెబుతున్నది. రూమర్లు, పుకార్లను బేస్ చేసుకొని దర్శకుడు రవికిశోర్ ఈ కథ తెరకెక్కించినట్టు తెలుస్తున్నది. సుదర్శన్ యాక్టింగ్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఆడియన్స్‌కి కనెక్టయ్యే సబ్జెక్ట్‌తో తీసిన ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని పరుచూరి వెంకటేశ్వరరావు అభిలషించారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతోపాటు అతిథిగా విచ్చేసిన రచయిత సాయిమాధవ్ బుర్రా కూడా మాట్లాడారు. ఈ సినిమాకు కెమెరా: శివకుమార్ దేవరకొండ, సంగీతం: వినోద్ యజమాన్య. నిర్మాణం: ఆర్పీ సినిమాస్.



## నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్రం సమన్లు

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 1999 నాటి కాందహార్ హైజాక్ ఉదంతం నేపథ్యంలో తెరకెక్కించిన 'ఐసీ 814: ది కాందహార్ హైజాక్' నెట్‌ఫ్లిక్స్ సిరీస్ వివాదాల్లో చిక్కుకుంది. ఇటీవల స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సిరీస్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. విజయ్‌వర్మ, నసీరుద్దీన్‌షా, అరవిందస్వామి తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. నేపాల్ రాజధాని ఖాట్మాండు నుంచి బయలుదేరిన భారతీయ విమానాన్ని పాకిస్థాన్ ఉగ్రవాదులు హైజాక్ చేసి కాందహార్‌కు తరలించడం, అక్కడ ఉగ్రవాదుల చెరనుంచి ప్రయాణికులను విడిపించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన చర్యల నేపథ్యంలో ఈ సిరీస్‌ను ఆసక్తికరంగా తెరకెక్కించారు. అయితే ఈ సిరీస్‌లో ఉగ్రవాదుల పేర్లను భోళాశంకర్, బర్గర్, డాక్టర్ అనే వివిధ పేర్లతో చూపించారు. దీనిపై సోషల్‌మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రేక్షకుల్ని తప్పుదోవ పట్టించేలా ఉద్దేశ్యపూర్వకంగా ఉగ్రవాదుల పేర్లను మార్చి చూపించారని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం కేంద్ర ప్రభుత్వ దృష్టికి చేరడంతో ప్రసార, మంత్రిత్వ శాఖ నెట్‌ఫ్లిక్స్‌కు సమన్లు జారీచేసింది. అయితే పేర్లు మార్చడం వెనక దురుద్దేశ్యం ఏమీ లేదని, విస్తృత పరిశోధన తర్వాతే స్క్రిప్ట్‌ను రూపొందించామని, హైజాక్ ఆపరేషన్ సమయంలో భారత ఇంటెలిజెన్స్ వర్గాలకు అనుమానం రాకుండా ఉగ్రవాదులు తమ సంభాషణల్లో పేర్లు మార్చుకొని పిలుచుకునేవారని దర్శకుడు అనుభవ్ సిన్హా ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వివరణ ఇచ్చాడు. అయితే ఈ వివాదంపై నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఎలా స్పందిస్తుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

## 'ఎమర్జెన్సీ' వాయిదా

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా, 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో రూపొందిస్తున్న 'ఎమర్జెన్సీ' సినిమా విడుదలను వాయిదా వేయాలని కేంద్ర సెన్సార్ బోర్డ్ చిత్ర నిర్మాతలను ఆదేశించింది. ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఈ నెల 6న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే సినిమాలో ఓ వర్గం మనోభావాలను కించపరిచారని, ఆపరేషన్ బ్లూస్టార్ నేపథ్యంలో మతపరంగా సున్నితమైన అంశాలు ఇందులో ఉన్నాయని సెన్సార్ బోర్డ్ చిత్రాన్ని వాయిదా వేసింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఢిల్లీ సిక్కు గురుద్వార మేనేజ్‌మెంట్ కమిటీ కేంద్ర సెన్సార్ బోర్డ్‌కు లేఖ రాసింది. ఈ సినిమా ట్రైలర్‌లో తమ వర్గంపై అనుమానం రేకెత్తించేలా సున్నితమైన అంశాలను ప్రస్తావించారని, అవాస్తవాలను చూపించారని గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇదిలావుండగా ఈ సినిమాపై నిషేధం విధించాలని దేశవ్యాప్తంగా పలు సిక్కు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

